నిబంధనలను కచ్చితంగా పాటించాలి

మెహిదీపట్నం, అక్టోబర్ 31 : రాజకీయ నాయకులు ఎన్నికల నిబంధనలు కచ్చితం గా పాటించాలని నాం పల్లి నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి లావణ్య అన్నారు. నామినేషన్ల పర్వం నవంబర్ 3 న ప్రారంభం కానున్నదని, 10 వరకు నామినేషన్లను స్వీకరిస్తామని, ఈ క్రమంలో నామినేషన్ పత్రాల్లో తమ పూర్తి వివరాలను పొందుపర్చాలని సూచించారు. పత్రాలను నింపడంలో అనుమానాలు ఉంటే సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని చెప్పారు. నామినేషన్ల దాఖలు చేయడానికి ర్యాలీలను నిర్వహించవద్దని, ఆర్భాటాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

3 నుంచి నామినేషన్ల పర్వం షురూ..

నామినేషన్ల పర్వం నవంబర్ 3 నుంచి ప్రారంభం కానుంది. నాంపల్లి నియోజకవర్గం నామినేషన్లను ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో అందించాల్సి ఉంటుందని రిటర్నింగ్ అధికారి లావణ్య చెప్పారు. నామినేషన్ ఫారాలను రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో తీసుకోవచ్చని, ఆన్‌లైన్‌లో కూడా తీసుకోవచ్చని తెలిపారు. ఎన్నికల కమిషన్ చెప్పిన ప్రకారం రూ.40 లక్షల వరకే ఖర్చు పెట్టాలని, ఖర్చులకు సంబంధించిన వివరాలను ఎన్నికల కమిషన్‌కు అందించాలన్నారు. నామినేషన్ దాఖలు వచ్చే సమయంలో ఐదుగురు మాత్రమే అనుమతింపబడతారని, వాహనాలు 100 మీటర్ల దూరం ఉంచి రావాలని రిటర్నింగ్ అధికారి తెలిపారు.

వాహనాల తనిఖీలకు సహకరించాలి

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాహనాల తనిఖీలకు ప్రజలు సహకరించాలని సుల్తాన్‌బజార్ ఏసీపీ ఎ. చిన్నబాలగంగి రెడ్డి అన్నారు. సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంకోఠి చౌరస్తా, కాచిగూడ ఛౌరస్తాలలో వాహనాల తనిఖీల లో భాగంగా నాకాబంధీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఏసీపీ, సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ కొత్తపల్లి ముత్తులు ఫ్లైయింగ్ స్క్వాలెన్స్ టీం, ఏసీపీ టీం, సుల్తాన్‌బజార్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలను క్షుణ్ణంగా పరిశీలించారు.

- సుల్తాన్‌బజార్, అక్టోబర్ 31

మల్లేపల్లిలో తనిఖీలను పరిశీలిస్తున్న దక్షిణ, పశ్చిమ మండలం అదనపు డీసీపీ అష్వాక్ అహ్మద్

టిప్పుఖాన్ పూల్ బ్రిడ్జి సమీపంలో తనిఖీలు చేస్తున్న లంగర్‌హౌస్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్ రావు, ఎస్సై రాజు

మెహిదీపట్నం, అక్టోబర్ 31 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. ప్రస్తుతం అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిల్లోని రోడ్లు, ప్రధాన చౌరస్తాల్లో వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. మంగళవారం గోల్కొండ, ఆసిఫ్‌నగర్ ఏసీపీ డివిజన్ల పరిధుల్లో దక్షిణ, పశ్చిమ మండలం అదనపు డీసీపీ అష్వాక్ అహ్మద్, ఇన్‌స్పెక్టర్లతో కలిసి పలు ప్రాంతాల్లో వాహనాల తనిఖీల్లో పాల్గొన్నారు. వాహనాల్లో డబ్బులను తరలిస్తున్న వారిని పట్టుకుంటున్న పోలీసులు వారి వద్ద రూ.50 వేల కన్నా ఎక్కువ ఉంటే సీజ్ చేసి ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అప్పగిస్తున్నారు.

హుమాయూన్‌నగర్ పీఎస్ పరిధిలోని మల్లేపల్లిలో అదనపు డీసీపీ అష్వాక్ అహ్మద్ వాహనాల తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ సైదేశ్వర్‌తో కలిసి పాల్గొన్నారు. అదే విధంగా లంగర్‌హౌస్‌లో గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్‌రావుతో కలిసి వాహనాలను తనిఖీలు చేశారు.

మైనార్టీల మద్దతు బీఆర్ఎస్‌కే

సీఎం కేసీఆర్ అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేశారని, రాష్ట్రంలో మైనార్టీల మద్దతు బీఆర్ఎస్‌కే ఉందని నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి సీహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. మంగళవారం నియోజకవర్గం మైనార్టీ నాయకులతో ఆనంద్‌కుమార్‌గౌడ్ సమావేశం అయ్యారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ పాలనలో అర్హులందరికీ పథకాలు అందుతున్నాయిని, బీఆర్ఎస్ ఘన విజయం సాధించి హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ చరిత్ర సృష్టిస్తారన్నారు. **- మెహిదీపట్నం, అక్టోబర్ 31**

ఆరెకటిక నాయకులతో భేటీ..

కార్వాన్ నియోజకవర్గం సీనియర్ నాయకుడు అమర్‌సింగ్ మంగళవారం సాయంత్రం లంగర్‌హౌస్ డివిజన్ ఆరెకటిక సంఘం నాయకులతో భేటీ అయ్యారు. ఆరెకటిక సంఘం సభ్యుల అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ధరంకార్ బ్రిజ్‌మోహన్, ధరంకార్ మధుసూదన్, హీరేకార్ అశోక్ పాల్గొన్నారు. **- మెహిదీపట్నం, అక్టోబర్ 31**

పరామర్శ

కామారెడ్డి వద్ద జరిగిన కారు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై మెహిదీపట్నం ఒలివ్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న కర్ణాటకకు చెందిన ముస్లిం మతపెద్ద మౌలానా పీఎం ముజమిల్ రాషీద్‌ను మంగళవారం ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్‌తో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్‌లతో రాషీద్ ఆరోగ్యంపై వాకబు చేసి, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఎంపీ సూచించారు. **- మెహిదీపట్నం, అక్టోబర్ 31**

తెలంగాణ ప్రతిష్టను ఇనుమడింపజేయాలి

మిస్టర్ యూనివర్సిటీ పోటీలో బంగారు పతకాన్ని సాధించిన సుల్తాన్ బిన్ అలీని సన్మానించి అభినందిస్తున్న టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ

సుల్తాన్ బజార్, అక్టోబర్ 31: క్రీడాకారులు ఉన్నతంగా రాణించి తెలంగాణ ప్రతిష్టను మరింత ఇనుమడింపజేయాలని టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ అన్నారు. మంగళవారం నాంపల్లిలోని గృహకల్ప ఆవరణలోని టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ కార్యాలయంలో మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో ఇటీవల జరిగిన మిస్టర్ యూనివర్సిటీ పోటీ – 2023లో అంతర్జాతీయ ఫిట్‌నెస్, బాడీ బిల్డింగ్ ఫెడరేషన్‌లో బంగారు పతకాన్ని గెలుచుకున్న హైదరాబాద్ యువకుడు సుల్తాన్ బిన్ అలీని ముజీబ్ హుస్సేనీ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిస్టర్ యూనివర్స్ పోటీలో పురుషుల ఫిజిక్ విభాగంలో ఓవరాల్ చాంపియన్ విజేతగా నిలిచినందుకు, అంతర్జాతీయ ఫిట్‌నెస్, బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ గోల్డ్ మెడల్ విజేత, బెంగళూరులో జరిగిన ఎన్‌బీఎఫ్ఎఫ్ మిస్టర్ ఇండియా బంగారు పతకాన్ని సాధించడం గర్వకారణమని అన్నారు. అంతే కాకుండా 2021లో ఉజ్బెకిస్తాన్‌లో జరిగిన పురుషుల ఫిజిక్ మిస్టర్ వరల్డ్ పో టీటీల్లో సిల్వర్ మెడల్ గెలుచుకున్న ఏకైక తెలంగాణ బిడ్డ సుల్తాన్ బిన్ అలీ అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా శాఖ కార్యదర్శి ఎస్.విక్రమ్ కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు కురాడి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి ఖాలేద్ అహ్మద్, సభ్యులు ముఖీమ్ ఖురేషి, శ్రీధర్‌నాయుడు, ప్రత్యేక అతిథులు టి.పర్వతాలు, సయ్యద్ అసదుద్దీన్, సయ్యద్ జమాల్ జహంగీర్, తౌసిఫ్ ఖాన్, రామకృష్ణారెడ్డి, జిల్లా శాఖ ఏపీఆర్‌వో మహ్మద్ వహీద్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కార్వాన్, అక్టోబర్ 31 : గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన గుడిమల్కాపూర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ ముజీబ్ ఉర్ రహ్మాన్ తెలిపిన వివరాల ప్రకారం.. పీవీఎన్ఆర్ పిల్లర్ నం.112 సమీపంలోని మూసీలో 35 ఏండ్ల వరకు ఉన్న ఓ గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహం స్వాధీనం చేసుకొని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఆధారాలు లభించలేదని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి సంబంధించివారు ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

చోరీ అయిన బస్సు దొరికింది

మెహిదీపట్నం, అక్టోబర్ 31 : మెహిదీపట్నం డిపో వద్ద చోరికి గురైన ఆర్టీసీ బస్సు మంగళవారం శంషాబాద్ ముచ్చింతల్ సమీపంలో దొరికిందని ఆసిఫ్‌నగర్ పోలీస్ డివిజన్ ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి తెలిపారు. ఏసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం తెల్లవారుజామున మెహిదీపట్నం ఆర్టీసీ డిపో ఎదుట పార్కు చేసిన ఆర్టీసీ అద్దె బస్సును గుర్తుతెలియని వ్యక్తి అక్కడి నుంచి తరలించాడు. డిపో అధికారులు అంతటా వెతికినా బస్సు జాడ తెలియక పోవడంతో సోమవారం సాయంత్రం ఆసిఫ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా మంగళవారం మధ్యాహ్నం జాడ తెలుసుకున్నారు. ముచ్చింతల్ సమీపంలో బస్సు ఉన్నట్లు తెలుసుకున్న పోలీసులు బస్సు స్వాధీనం చేసుకుని ఆసిఫ్‌నగర్‌కు తరలించారు. సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాల ఆధారంగా దొంగలను పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి తెలిపారు.

ఉక్కు మనిషికి ఘన నివాళి

ఉక్కు మనిషి సర్దార్ వల్లాభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి మంగళవారం లతా మా ఫౌండేషన్ చైర్‌పర్సన్ మాధవీలత, ఠాకూర్ యమన్ సింగ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భారతదేశం ఏకీకరణకు కృషి చేసిన పటేల్ గొప్పతనాన్ని కొనియాడారు.

- అబిడ్స్, అక్టోబర్ 31

నాంపల్లి ఎమ్మెల్యే పర్యటన

మెహిదీపట్నం డివిజన్ మురాద్‌నగర్, జేబాబాగ్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెరాజ్, నగర మాజీ మేయర్, మెహిదీపట్నం కార్పొరేటర్ మాజీద్ హుస్సేన్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు, ఎంఐఎం నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. నియోజకవర్గం అభివృద్ధికి కోట్ల రూపాయలతో పనులను చేపట్టామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

- మెహిదీపట్నం, అక్టోబర్ 31